క్లుప్తంగా

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి

రాజంపేట: ప్రజల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాజంపేట ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు ఆకేపాటి అమర్నాథ రెడ్డి అన్నారు. శనివారం ఆకేపాటి ఎస్టేట్‌లో ఎమ్మెల్యేను పలువురు ప్రజలు కలిసి తమ సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలపై అప్పటికప్పుడు సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. అధికారులు ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

రాయచోటి జగదాంబసెంటర్ : జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘం లిమిటెడ్ అన్నమయ్య జిల్లా వారి ఆధ్వర్యంలో ఏపీఎస్‌ఆర్‌టీసీ వారి ద్వారా భారీ మోటార్ డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చైర్మన్ జి.రాజ్యలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 40 సంవత్సరాలలోపు వయస్సు కలిగి ఎల్ఎంవీ లైసెన్స్ కలిగి హెచ్ఎంవీ కొరకు ఎల్ఎల్ఆర్ కలిగి ఉన్న జిల్లా షెడ్యూల్డ్ కులానికి చెందిన వారై ఉండాలన్నారు. జిల్లాలో ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలను ఎంపిక చేయనున్నారని తెలిపారు. సెప్టెంబర్ 4వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న న్యాయవాది రామదాసు

సిద్దవటం : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీనియర్ న్యాయవాది రామదాసు అన్నారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని చెంచులక్ష్మీ ఎస్టీ కాలనీలో శనివారం మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం నేరమని, ఆడవారికి 18 సంవత్సరాలు, మగవారికి 21 సంవత్సరాలు పూర్తయ్యాక వివాహాలు చేయాలని తెలిపారు. వివాహ వయస్సు కాకముందే బాల్య వివాహాలు చేపడితే పీసీఎంఏ చట్టం-2006 ప్రకారం రెండు సంవత్సరాలు జైలుశిక్ష, జరిమానా విధిస్తారని, ఎవరైనా చట్టవిరుద్ధంగా బాల్య వివాహాలు చేపడితే 1098 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీవిరమణ తప్పనిసరి

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీవిరమణ తప్పనిసరి అని ఎంఈఓ-1 రామచంద్రుడు, ఎంఈఓ-2 జయచంద్ర వ్యాఖ్యానించారు. శనివారం రామాపురం మండలం మేదరపల్లి ఎంపీపీ పాఠశాల హెడ్‌టీచర్ బి.శ్రీరాములు పదవీవిరమణ సన్మానసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఈఓలు మాట్లాడుతూ బి.శ్రీరాములు తన పదవీకాలంలో ఎంతో మంది విద్యార్థులను అత్యున్నతంగా తీర్చిదిద్దారని కొనియాడారు. అనంతరం బి.శ్రీరాములు, బి. లక్ష్మీదేవి దంపతులను ఘనంగా సత్కరించారు. ఏపీటీఎఫ్ స్టేట్ జనరల్ సెక్రటరీ బి.రాధాకృష్ణ, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సూర్యుడునాయక్, రాయచోటిలోని సాయి డెంటల్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ రాజగోపాల్ పాల్గొన్నారు.

ఘన నివాళి



జ్యోతి మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి, నాయకులు

సిద్దవటం : సిద్దవటం దిగువపేటలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆలం గోపాలస్వామి సతీమణి జ్యోతి (56) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ రెడ్డి, కడప నగర్ మేయర్ కె. సురేష్ బాబు, సిద్దవటానికి వచ్చి జ్యోతి మృతదేహానికి నివాళులు అర్పించారు. జెడ్పీటీసీ ఉకాసి శ్రీకాంత్ రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు నారపు రెడ్డి శ్రీనివాసులు రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నీలకంఠరెడ్డి, రాజంపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు కేవీ సుబ్బయ్య, యూత్ కన్వీనర్ కృష్ణ చైతన్య, ఎస్సీసెల్ కన్వీనర్ పుల్లయ్య, ప్రచార కమిటీ కన్వీనర్ ప్రేమ్ కుమార్, అఫ్షన్ సభ్యుడు సయ్యద్ నూర్, పార్టీ నాయకులు కేవీ సుబ్బారెడ్డి, పవన్, ప్రసాద్ రెడ్డి, శంకర్ రెడ్డి, ఎంపీ సుబ్బారెడ్డి, కె. పెంచలయ్య, నరసింహారావు, సుబ్రహ్మణ్యం, ఎం శ్రీనివాసులు రెడ్డి, దిలీప్ కుమార్, వెంకటయ్య పాల్గొన్నారు.

కరువు నేలలో డ్రాగన్ సిరులు

- కొత్త రకం పంటసాగుపై రైతుల ఆసక్తి
- ఒకసారే పెట్టుబడి.. 20 ఏళ్ల పాటు దిగుబడి



రామాపురం మండలంలో సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్ పంట

రాయచోటి జగదాంబసెంటర్ : బీడు భూముల్లో సైతం బంగారం పండించవచ్చు అని నిరూపిస్తున్నారు రాయచోటి నియోజకవర్గ రైతులు. సంప్రదాయ పంటలతో ఆశించిన ఆదాయం రాకపోవడంతో అన్నదాత ఆలోచన ఉద్యాన పంటలవైపు దృష్టి సారిస్తున్నారు. అందులో విదేశీ పంటను కూడా సాగుచేస్తూ వినూత్న పద్ధతులు మెళకువలు పాటిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. కరోనా సమయంలో మొదలైన ఆలోచన నూతన పంటవైపు అడుగులు వేసింది. ఔషధ గుణాలు మెండుగా కలిగిన డ్రాగన్ ఫ్రూట్ సాగుపై దృష్టిపెట్టి లాభాలు గడిస్తున్నారు.

పంట సాగు ఇలా..

డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు పెరిగి అల్లుకోవడానికి వీలుగా ముందుగానే భూమిలో 8-10 అడుగుల వెడల్పుతో గుంతలు తవ్వి రాయి, సిమెంట్ కప్పులు (స్తంభాలు) నాటుతారు. వాటిపై రెండడుగుల వెడల్పు, రెండించుల మందంతో సిమెంట్‌తో తయారు చేసిన గుండ్రటి పలకలు లేదా ద్విచక్రవాహనాల టైర్లు అమర్చుతాయి. టైర్లు ఏర్పాటు చేస్తే ఖర్చు మరింత తగ్గుతుంది. స్తంభం చుట్టూ భూమిపై రెండించుల మందంతో ఎరువు, మట్టితో బెడ్డింగ్ ఏర్పాటు చేసి ఒక్కో స్తంభానికి నాలుగు వైపులా నాలుగు మొక్కలు నాటామని రైతులు తెలిపారు. ఒక ఎకరాకు 400 స్తంభాల చుట్టూ 1,600 చొప్పున డ్రాగన ఫ్రూట్ మొక్కలు (పిలకలు) నాటి డ్రిప్ పైపుల ద్వారా వాటికి నీటిని అందిస్తున్నట్లు వివరించారు. వీటన్నంటికీ ఎకరాకు రూ.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టామని తెలిపారు.

ఒకసారే పెట్టుబడి

డ్రాగన్ ఫ్రూట్ పంట సాగుకు పిలకలు (మొక్కలు) నాటినప్పుడు ఒకసారి మాత్రమే పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. నేల స్వభావాన్ని బట్టి ఏడాదిన్నర నుంచి రెండేళ్లలోపు కాయలు కోసి కోతకు వస్తాయి. తర్వాత ఆరు నెలలు, ఏడాదికో ఒకసారి కలుపు తొలగించి ఎరువులు, మందులు వేసుకోవాలి. ఇలా ఒకసారి చేసుకుంటూ 20 ఏళ్ల పాటు డ్రాగన్ ఫ్రూట్ దిగుబడి వస్తూనే ఉంటుంది.

మార్కెట్లో డిమాండ్

డ్రాగన్ ఫ్రూట్ పండ్లకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. పెద్ద పెద్ద పట్టణాలు, నగరాల్లో మాత్రమే దొరికే ఈ కాయలు సైజును బట్టి కిలో రూ.150 నుంచి రూ.300పైన ధర పలుకుతున్నాయి. ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు తోట వద్దకు వచ్చి కిలో (3 నుంచి 4 పండ్లు) రూ.130 ధరతో కొనుగోలు చేసి కోసుకెళ్తున్నారు. ఇక్కడ పండే గ్రాన్ ఫ్రూట్ పండ్లు ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి.

ఆరోగ్యానికీ మేలు

డ్రాగన్ ఫ్రూట్‌లో క్యాల్షియం, పాస్పరస్, జింక్, మెగ్నీసియం, ఐరన్, విటమిన్ సీ లవణాలు పుష్కలంగా ఉంటాయి. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని శాస్త్రవేత్తలు, వైద్యనిపుణులు చెబుతున్నారు. షుగర్ జీరో శాతం ఉండే ఈ డ్రాగన్ ఫ్రూట్ బ్లడ్ షుగర్ లెవెల్స్‌ను అదుపులో ఉంచి డయాబెటిస్ నుంచి ఉపశమనం కలిగిస్తుంది. మలబద్ధకాన్ని తగ్గించి జీర్ణశక్తిని పెంచుతుంది. గుండె పరికరాలు, కాలేయం పనితీరును మెరుగుపరిచి రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

జిల్లా కేంద్రంగా రాయచోటినే కొనసాగించాలి



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

రాయచోటి టౌన్ : గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రాయచోటిని జిల్లా కేంద్రంగానే ఉంచుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ప్రజాస్వామ్య సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రాయచోటి అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు టి.ఈశ్వర్, ఎంఆర్‌పీఎస్ నాయకులు రామాంజనేయులు, ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్బవరం హరిబాబు, భారతీయ అంబేద్కర్ సేన పల్లం తాతయ్య, రజక సంఘం నాయకులు టి.రమేష్, వీరబల్లి శ్రీనివాసులు, రాయచోటి మండల లీగల్ సర్వీస్ కమిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి తదితరులు నిర్ణయించారు. ఈ సమావేశం రాయచోటి అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభవుతుందని తెలిపారు. ఈ సమావేశానికి ప్రజా సంఘాల నాయకులు, న్యాయవాదులు, బీసీ సంఘాలు ప్రజాస్వామ్యవాదులు హాజరై.. అభిప్రాయాలను తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆక్రమణల తొలగింపునకు రెండు రోజుల గడువు



ట్రాక్టర్ సహాయంతో ఆక్రమణలు తొలగిస్తున్న పంచాయతీ అధికారులు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీకోదండ రామాలయం వెనుక 1500 బీ1 సర్వే నంబర్‌లో గ్రామ పంచాయతీ స్థలంలో దశాబ్దకాలంగా కొంత మంది పంచాయతీ అనుమతులు లేకుండా అక్రమంగా దుకాణాలను ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. ఈ అక్రమణలను తొలగించాలని ఒంటిమిట్ట పంచాయతీ సర్పంచ్ కత్తి సుజాత, కార్యదర్శి సుధాకర్ పలు మార్లు నోటీసులు జారీ చేసిన దుకాణాదారుల వద్ద నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో శనివారం సర్పంచ్ , కార్యదర్శి కలిసి పోలీసుల సహాయంతో అక్రమ దుకాణాలను తొలగించాలని నిర్ణయం తీసుకున్నారు. శనివారం మధ్యాహ్నం 27 దుకాణాలను తొలగించడం ప్రారంభించారు. అందులో ఖాళీగా ఉన్న 6 దుకాణాలను పంచాయతీ వారు తొలగించగా మిగిలిన 21 దుకాణాల్లో సామగ్రి, వస్తువులు ఉండటంతో దుకాణాదారులు పంచాయతీ వారిని రెండు రోజులు గడువు ఇవ్వాలని కోరారు. దీంతో పంచాయతీ అధికారులు దుకాణా దారులకు వారు అడిగిన రెండు రోజుల అనుమతిని అంగికరించి, అక్కడి నుంచి వెళ్లి పోయారు. రెండు రోజుల్లో ఖాళీ చేయకుంటే దుకాణాలను తొలగించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

గంగ ఒడి చేరిన గౌరీ సుతుడు

విఘ్నాలు తొలగించమని గణనాథుడిని కోరుతూ ఎంతో నిష్టతో ప్రత్యేక పూజలు చేసిన భక్తులు కోలాహలంగా గౌరీసుతుడిని గంగ ఒడికి చేర్చారు. శనివారం కుల, మతాలకు అతీతంగా కేరింతలు కొడుతూ యువత ఉత్సాహంగా వేడుకలు చేసుకున్నారు. చవితి వేడుకల్లో రోజుకొక కార్యక్రమంతో మహిళలు సైతం ఆనందంగా పాల్గొన్నారు. ఉత్సవ కమిటీలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. చాలా ప్రాంతాల్లో వినాయక ప్రతిమ వద్ద ఉంచిన లడ్డూ ప్రసాదాన్ని కమిటీలు వేలం వేశారు. భారీ ధర వెచ్చించి వేలం పాటలో స్వామివారి లడ్డూను దక్కించుకున్నారు.

- ఘనంగా గణనాథుడి నిమజ్జనం
- ఉత్సవాల్లో కేరింతలతో యువత
- భారీగా లడ్డూ వేలం



లక్కిరెడ్డిపల్లి: కుటుంబ సమేతంగా వినాయకుడికి పూజలు చేస్తున్న ఎంపీపీ



పెనగలూరు: స్వామి, అమ్మవార్ల కల్యాణం చేస్తున్న అర్చకులు

సంబేపల్లి: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలలో కొలువైన గణనాధులు ప్రతిమలను గంగ ఒడికి తీసుకెళ్ళారు. ఉదయం నుంచి ఆయా గ్రామాలలోని ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గణనాధులని విగ్రహాలను పురవీదులలో బాణా సంచులు కాలుస్తూ, డప్పు వాయిద్యాల నడుమ వైభవంగా నిమజ్జం వేడుకలను నిర్వహించారు. మహిళలు, చిన్నారులు, యువత జైబోలో గణేష్ మహరాజ్‌కి జై అంటూ నిమజ్జన కార్యక్రమాన్ని భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఆయా గ్రామాలలోని చెరువులు,కుంటలు వాగులలో ఉన్న నీటిలో గణనాధులని విగ్రహాలను నిమజ్జనం చేశారు. వచ్చిభక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు.

రూ. 1,15000 పలికిన లడ్డూ

పెనగలూరు: మండల కేంద్రమైన పెనగలూరు పంచాయతీ, ఇండ్లూరు వినాయక స్వామి లడ్డూను పుల్లారెడ్డి లక్ష, పదిహేను వేల రూపాయలకు దక్కించుకున్నారు. అలాగే అనంతంపల్లి గ్రామంలో తుమ్మల రమణయ్య కుమారులు తేజేశ్వర్, భరత్ సాయిలు రూ. 43 వేలకు వేలం పాడి లడ్డూను దక్కించుకున్నారు. పెనగలూరు వినాయక స్వామి లడ్డూను చంటి అనే వ్యక్తి రూ. 40 వేలకు దక్కించుకున్నాడు. అరుంధతివాడ వినాయక స్వామి ఆలయంలో లడ్డు వేలం వేయగా జయరామయ్య అనే వ్యక్తి రూ. 25 వేలకు దక్కించుకున్నాడు.

ప్రత్యేక పూజలు

మండల కేంద్రమైన పెనగలూరు పంచాయతీ, ఇండ్లూరు గ్రామంలోని గౌరీ సిద్దేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గౌరీ సిద్దేశ్వరులకు పలువురు భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి కాయా, కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కనుల పండువగా కల్యాణం

మండల కేంద్రమైన పెనగలూరు పంచాయతీలోని పి. కొత్తపల్లి గ్రామంలో శనివారం రాత్రి వినాయక స్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. కల్యాణాన్ని పథకమూరి యానాదయ్య నాయుడు, రాజేశ్వరమ్మ దంపతులు ఈ కల్యాణాన్ని నిర్వహించారు. దువ్వూరి పరందామిరెడ్డి, లక్ష్మీదేవి దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

అలరించిన ముగ్గుల పోటీలు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లెలోని జూనియర్ సివిల్ కోర్టు వద్ద ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రంగువల్లుల పోటీలు అలరించాయి. ఈ పోటీలలో కవిత ప్రథమ స్థానంలో ఎంబలూరు కల్యాణి ద్వితీయ స్థానంలో నారాయణమ్మ తృతీయ స్థానంలో నిలిచారు. న్యాయనిర్ణేతలుగా డాక్టర్ శ్రీవాణి, వైఎస్‌ఆర్‌సీపీ మహిళా మండల అధ్యక్షురాలు పల్లె మాధవి వ్యవహరించారు. ఆకేపాటి జగదీశ్వర్‌రెడ్డి, వల్లంకొండు శివకుమార్, మేడ వెంకటకుమార్, గీత, కృష్ణ, నారాయణ, గండికోట శివకుమార్, మురళి, నారాయణశెట్టి, సుమ, జ్యోతి, లక్ష్మీ, పద్మజ, అఖిల, విజయ పాల్గొన్నారు.

గణనాథుడికి పూజలు

మండలంలోని టీవీపురంలో వైఎస్‌ఆర్‌సీపీ బీసీ విభాగం రాజంపేట నియోజకవర్గ అధ్యక్షులు భాస్కర్‌యాదవ్ ఆధ్వర్యంలో వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద 50 కేజీల లడ్డూను వేలంపాటలో రూ.50 వేలకు గోగుల శ్రీనివాసులు దక్కించుకున్నారు. వై.వెంకటసుబ్బయ్య, నారాయణ, భాస్కర్‌రాజు, మల్లిఖార్జునరాజు, ఎం.శివ, చందు, సుబ్బు, వాసు, సుబ్బరాయుడు, కోటి, కిరణ్, కళ్యాణ్, భరత్, సిద్దయ్య, రమణయ్య పాల్గొన్నారు.

అన్నదానం

మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లిలోని రైల్వేగేటుకు వెళ్లే వారి వద్ద ఏర్పాటు చేసిన వినాయక ఉత్సవ కమిటీ 19వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద శనివారం మధ్యాహ్నం తాటి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే నాగిరెడ్డిపల్లిలో ఓని కోర్టు వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద మాజీ జెడ్పీటీసీ యల్లటూరు శివరామరాజు, యల్లటూరు యాదగిరిరాజు, సమ్మెట శివప్రసాద్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ మహిళా మండల అధ్యక్షురాలు పల్లె మాధవి, మేడ వెంకటకుమార్, ఆకేపాటి జగదీశ్వర్‌రెడ్డి, కొత్తపల్లి రాజాచారి, వల్లంకొండు శివకుమార్, వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

శోభాయాత్రలో యువత ఉత్సాహం

గాలివీడు : చవితి సందర్భంగా విశేష పూజలందుకున్న గణేశుడు శనివారం గంగ ఒడికి చేరాడు. మండల వ్యాప్తంగా వినాయక నిమజ్జన వేడుకలు కోలాహలంగా జరిగాయి. జై గణేశా.. జైజై గణేశా నినాదాలు, మేళతాళాలతో గణనాథుడి నిమజ్జన కార్యక్రమం సంబరంగా సాగింది. పలు విగ్రహాల వద్ద వేలంపాటలో లడ్డూను దక్కించుకున్నారు.

అన్నదానం పుణ్యకార్యం

లక్కిరెడ్డిపల్లి: అన్నదానం పుణ్యకార్యమని ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని స్థానిక లక్కిరెడ్డిపల్లి స్టేట్ బ్యాంక్ సమీపంలోని వినాయక మంటపాల వద్ద భక్తులకు ఎంపీపీ కుటుంబసభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన ఏపీఓ సురేంద్రనాథ్ రెడ్డిలు స్వామివారికి పూజలు చేశారు. అనంతరం సుదర్శన్‌రెడ్డిని సురేంద్రనాథ్‌రెడ్డిని నిర్వాహకులు సత్కరించారు. కమిటీ నిర్వహకులు రఘునాథ, ప్రసాద్ యాదవ్, కుళాయప్ప, చంద్ర,శ్రీనివాసులు, శంకర, ఉప మండల అధ్యక్షులు సుబ్బరాయుడు, సర్పంచ్‌లు వెంకటనారాయణ రెడ్డి, గడ్డం కల్యాణి ప్రభాకర్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు దస్తగిరి, లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్‌లు దుర్గయ్య, ఉప సర్పంచ్‌లు సంజీవరెడ్డి, మైనార్టీ నాయకులు చాన్‌బాషా, జాకీర్, కాజా, కదిరి సాహెబ్ సద్దాం, సభాపతి నాయుడు, నాగ శేషారెడ్డి, బస్‌రెడ్డి, శంకర్ రెడ్డి, తోపురెడ్డి గోపాల్ రెడ్డి, తోపురెడ్డి మల్‌రెడ్డి, డిల్లీ విశ్వనాథ రెడ్డి, కొండా ఓబుల్ రెడ్డి, నాగముని, నారద పాల్గొన్నారు.

ఘనంగా నిమజ్జనం

ఓబులవారిపల్లె: చెంచువారిపల్లి గ్రామంలో వినాయక విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బెంగళూరు, హైదరాబాదు రాష్ట్రాలలో ఉద్యోగాలు చేస్తున్న యువత వినాయక నిమజ్జనానికి స్వగ్రామానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఊరేగింపులో పాల్గొన్నారు.

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణం, రూరల్ పరిధిలో మండపాలలో ఏర్పాటు చేసిన వినాయకుడికి నిర్వహకులు శనివారం విశేష పూజలు నిర్వహించారు. అలాగే మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. మదనపల్లె రోడ్డులో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహం వద్ద అజయ్ కన్వెన్షన్ హాల్ యజమాని గోవిందు సుధాకర్, కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరిని నిర్వహకులు సన్మానించారు. నిర్వహకులు జంగారెడ్డి, సురేష్ రెడ్డి, మట్లి సర్పంచ్ సోమారపు నాగార్జునాచారి, షేక్ మహమ్మద్, బండల శివారెడ్డి, రామలింగారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా నిమజ్జనం

పుల్లంపేట: మండలంలోని అనంతంపల్లి జానకీపురంలో శనివారం వినాయకుడి నిమజ్జన కార్యక్రమం వైభవంగా జరిగింది. వినాయకస్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. యువకులు రంగులు చల్లుకుంటూ, వసంతాలు పోసుకుంటూ ఆనందోత్సాహాల మధ్య నిమజ్జనం పాల్గొన్నారు. స్వామివారి లడ్డూను పి. పెంచలయ్య రూ. 65 వేలకు దక్కించుకున్నాడు.

చిన్నమండెం : మండలంలో గ్రామాల్లో నెలకొల్పిన వినాయక ప్రతిమల వద్ద శనివారం నిర్వహించిన సంబరాలు అంబరాన్నంటాయి. సి.పాలిమేరపల్లెలో ఏర్పాటు చేసిన గణనాథుడి మండపం వద్ద నిర్వహించిన లడ్డూ వేలం పాటను రూ.1.75 లక్షలకు యర్రగుడి ఆనందరెడ్డి దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు. అదే విధంగా మల్లూరు గ్రామం కొత్తపేటలో నిర్వహించిన లడ్డూ వేలంపాటలో రూ.78 వేలకు బల్ల చిన్నయ్య దక్కించుకున్నారు. ఉత్సవ కమటీ సభ్యులు దాదినేని సుధాకర్, ఆర్‌పీఎస్ వాల్మీకి అధ్యక్షుడు మండ్ల జయశంకర్, అశోక్, రామచంద్ర, వెంకటాద్రి, మహేష్, వెంకీల ఆధ్వర్యంలో నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు.



నందలూరు: అన్నం వడ్డిస్తున్న దాతలు



నందలూరు : కవితకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు



చిన్నమండెం : లడ్డూను ఊరేగింపుగా తీసుకెళ్తున్న యర్రగుడి ఆనందరెడ్డి



నందలూరు : వేలంపాటలో లడ్డూను దక్కించుకున్న గోగుల శ్రీనివాసులు



పెనగలూరు: అనంతంపల్లిలో వినాయకుడి లడ్డూతో రమణయ్య కుటుంబసభ్యులు



రాయచోటి టౌన్ : గోవిందు సుధాకర్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు



గాలివీడు : శోభాయాత్రలో చెక్కభజన కళాకారుల ప్రదర్శన



ఓబులవారిపల్లె: చెంచువారిపల్లిలో గణనాథుడిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తు



చిన్నమండెం : నిమజ్జనానికి లంబోదరుడిని తరలిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

విద్యార్థులకు అటల్ టింకరింగ్ ల్యాబ్ వరం

సంబేపల్లె : నిరుపేద విద్యార్థులకు అటల్ టింకరింగ్ ల్యాబ్ వరంలాంటిదని సైన్స్ అధికారి ఓబుల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని యర్రగుంట్ల సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలోని అటల్ టింకరింగ్ ప్రయోగాన్ని శనివారం ఓబుల్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రయోగాశాల పనితీరును విద్యార్థుల రూపొందించిన ప్రాజెక్టులు, రికార్డులను పరిశీలించారు. నేషనల్ ఇన్నోవేషన్ మిషన్ వారు కేటాయించిన నిధుల వినియోగాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటల్ టింకరింగ్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవచ్చునన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో విద్యార్థుల నైపుణ్యాలు పెంపొందించుకొని త్రీడి ప్రింటింగ్ మిషను ఉపయోగించి మోడల్ రూపొందించాలని సైన్స్ ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ల్యాబ్‌లలో విద్యార్థులకు కోడింగ్ నైపుణ్యాలను పెంపొందిస్తున్నట్లు పేర్కొన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటించండి

చిన్నమండెం : మామిడి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యాన అధికారి జి.సురేష్ బాబు తెలిపారు. మండల పరిధిలోని చాకిబండ, వండాడి రైతు సేవ కేంద్రాల పరిధిలోని మామిడి రైతులకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన విభాగ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ మామిడి ముదురు తోటల్లో కాయ కోత అనంతరం కొమ్మ కత్తిరింపులు, సస్యరక్షణ, సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.

రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

రాజంపేట: రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని ఏఐటీయూసీ జిల్లా సంయుక్త కార్యదర్శి సికిందర్ డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాజంపేట పర్యటన సందర్భంగా ఈ ప్రాంతానికి న్యాయం చేస్తారని ఆశిస్తున్నామన్నారు. ఆటోకార్మికులను ఆదుకోవాలని, వాహనమిత్ర సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. రాజంపేటలో మూతపడిన పాలకేంద్రాన్ని తెరవాలని కోరారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు రమణ, మల్లికార్జున, బాబా జాన్, నరసింహ, శివ, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.